www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 16 జులై 2023

5

చిత్తూరు



18న జాబ్ మేళా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 18వ తేది స్థానిక నాయుడు బిల్డింగ్స్‌లోని విజయం సైన్సు అండ్ ఆర్ట్ డిగ్రీ కళాశాల్లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి పేర్కొన్నారు. డిగ్రీ, పీజి, పాలటెక్నిక్ పూర్తి అభ్యర్థులు అర్హులని, జాతీయ అంతర్జాతీయ బ్యాంకులతో పాటు గుర్తింపు పొందిన బహులజాతీ కంపెనీల్లో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ రుసుం లేదని అర్హతలు కలిగిన అభ్యర్థులు తమ వెంట రెజ్యూమ్, సర్టిఫికెట్లు ఫోటోలు తీసుకొని ఈనెల 18వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు విజయం డిగ్రీ కళాశాల్లో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు హాజరుకావాలని పేర్కొన్నారు.

పకడ్బందీగా పిసిపిఎన్‌డిటి చట్టం అమలు

అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్‌ల వద్ద పటిష్టమైన నిఘా



పిసిపిఎన్‌డిటి చట్టం అమలుపై సరిహద్దు రాష్ట్రాల అధికార్లతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అంతర్రాష్ట్రాల సరిహద్దు జిల్లాల సమన్వయంతో పకడ్బందీగా పిసి పిఎన్‌డిటి చట్టం అమలుకు చర్యలు చేపడతామని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దులో గల ఇతర రాష్ట్రాలకు చెందిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పిసి పిఎన్ డిటి (లింగ నిర్ధారణ) చట్టాన్ని పకడ్బందీగా అమలుకు తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీ భ్రూణ హత్యలు అంటే పుట్టబోయే ఆడ శిశువని తెలిసి గర్భస్రావం ద్వారా హత్యచేయటమేనని ఇందుకు చట్టం తావివ్వదని తెలిపారు. సమాజంలో స్త్రీ పురుష లింగ నిష్పత్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని, అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో సరిహద్దు జిల్లాల ప్రాంతాలలో గల అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లపై నిఘా పెంచాలన్నారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడే వారిని గుర్తించి నివేదిక అందించాలని సూచించారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రాల దుర్వినియోగాన్ని అరికట్టడానికి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు నిర్వహించాలని డ్రగ్ ఇన్స్పెక్టర్, పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గర్భస్రావ మందులు, పరికరాలు విచ్చలవిడి అమ్మకాన్ని నిరోధించాలని, డ్రగ్స్ కొనుగోలు, అమ్మకానికి సంబంధించిన నివేదికను తనిఖీల్లో భాగంగా పరిశీలించాలని తెలిపారు. పుట్టబోయే శిశువుల లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవిరుద్ధమే విషయంపై ప్రజల్లో విస్తత అవగాహన తీసుకురావాలన్నారు. జిల్లాలోని ఆర్ఎంపి డాక్టర్లు అందరికీ ఒక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని డిఎం అండ్ హెచ్ఓను ఆదేశించారు. ఆసుపత్రులలో అల్ట్రాసౌండ్ స్కాన్ చేయడానికి ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాలను పాటించాలన్నారు. ప్రభుత్వం పరంగా అనుమతులు తీసుకున్న తరువాతనే అల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహించాలని, స్కానింగ్ కేంద్రాలలో పని చేసే సిబ్బంది పూర్తిస్థాయి అర్హత, అనుభవం కలిగి ఉండాలన్నారు. అన్ని రికార్డులను పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఈస్కానింగ్‌కు సంబంధించి పరికరాలను, మెషిన్‌ల ఉత్పత్తిదారులు, పంపిణీదారులు, అమ్మకపుదారులు అనుమతి పత్రములను సమర్పించిన తరువాతనే వినియోగదారులకు విక్రయించాలని, గర్భస్థ పిండానికి సంబంధించి జన్యుపరమైన వ్యాధులు కనుగొనడానికి మాత్రమే అల్ట్రాసౌండ్ స్కానింగ్ పద్ధతి ఉపయోగించాలన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారికి జరిమానాతో సహా జైలు శిక్ష విధించడం జరుగుతుందని డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఓ.ప్రభావతి దేవి కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా 1వ అదనపు న్యాయమూర్తి జస్టిస్ రమేష్, తమిళనాడు రాష్ట్రం వేలూరు, తిరుపత్తూరు, తిరువళ్ళూరు, కష్ణగిరి జిల్లాల నుండి వైద్యఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్లు డాక్టర్ పి.బాలచందర్, డాక్టర్ మారిముత్తు, డాక్టర్ పి.శేఖర్, డాక్టర్ పరమశివం, కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎం.జగదీష్, డాక్టర్ చందన్ కుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు, జిల్లా ఆరోగ్య విద్యాధికారి గుణశేఖర్, జిల్లా గణాంకాల అధికారి జార్జ్, దిశ డిఎస్‌పి రఘువీరా విష్ణు, డ్రగ్ ఇన్స్పెక్టర్ కీర్తన, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలను అరికట్టేందుకు సమిష్టిగా కృషి

మాతా శిశుమరణాలను అరికట్టేందుకు సమిష్టిగా కషి చేద్దామని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ ప్రసూతి మరణాలకు సంబంధించి జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో సమూల సంస్కరణలు చేపట్టిందని, ఈ సంస్కరణల ఫలితాలు క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరికీ అందేలా వైద్య ఆరోగ్య శాఖ పనిచేయాలని సూచించారు. గర్భవతుల ఆరోగ్యంపట్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలని క్షేత్ర స్థాయిలో ఈ విషయంలో ఏఎన్ఎంలు, ఆశాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు అయ్యేంత వరకు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మాతా శిశు మరణాలు జరగకూడదని అన్నారు. గర్భిణీ స్త్రీగా అంగన్వాడీ కేంద్రంలో నమోదైన నాటి నుండి సుఖ ప్రసవం జరిగే వరకు సంబంధిత యాప్‌లో వారి ఆరోగ్య స్థితిగతులను అప్ లోడ్ చేయడంతోపాటు వారికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు ఆశాలు, ఏ ఎన్ ఎం లు స్పందించి వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా వైద్యశాఖ అధికారి ప్రభావతి, డిసిహెచ్ ఎస్.నాయక్, డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.

యువరైతు ఆత్మహత్య

14 రోజులు చావుతో పోరాడి స్విమ్స్‌లో మృతి



మృతుడు సోమశేఖర్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- పుంగనూరు: అప్పులు చేసి పంటల సాగుకు ఖర్చుచేసి గిట్టుబాటు ధర రాక చేసిన అప్పుకు వడ్డీలు కట్టలేక డబ్బు ఇచ్చినవారు పోరు భరించలేక క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించి 14 రోజులు పాటు తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో మత్యువుతో పోరాడి మతి చెందిన సంఘటనతో ఆ గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం మద్దనపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు సోమశేఖర్ (29) ఇతని భాగానికి కాను మూడుఎకరాల వ్యవసాయ పొలం వచ్చినది. ఈ పొలంలో టమోటో, దోసకాయ, కాలీఫ్లవర్ పంటలను సాగు చేశాడు. ఈ సాగుకు కాను అవసరమైన రూ.8లక్షలు డబ్బులను అప్పులు చేసి పంటలు సాగు చేయడం జరిగింది. వేసిన పంటలకు గిట్టుబాటు ధరలేక పెట్టిన పెట్టుబడి రాక అప్పు ఇచ్చిన వారు డబ్బులు అడగడంతో వారికి ఏమి చెప్పాలో తెలియక జీవితంపై విరక్తి చెంది పొలాలకు వాడే క్రిమిసంహారక మందును తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈనెల 3న ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించాలని వైద్యులు సూచించారు. వైద్యులు సూచన మేరకు మూడో తేదీన స్విమ్స్ ఆసుపత్రిలో సోమశేఖర్‌ను చేర్పించారు. సుమారు 14 రోజులపాటు మత్యువుతో పోరాడి గెలవలేక మత్యు ఒడిలోకి జారుకున్నాడు. మతుని భార్య మౌనిక, 5సంవత్సరాల పాప, ఒకటిన్నర సంవత్సరం బాబు ఉన్నారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా సంబరాల ప్రణాళికలను సిద్ధం చేయండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో అక్టోబర్ 2న మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా నిర్వహించనున్న క్రీడా సంబరాలకు జిల్లాలో కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో అక్టోబర్ 2 నుండి గ్రామ స్థాయి నుండి జిల్లాస్థాయి వరకు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల నుండి మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి వరకు పోటీల నిర్వహణకు అవసరమైన క్రీడల మైదానాలను గుర్తించాలని, క్రీడల నిర్వహణకు అనువుగా ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ పోటీలలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కోకో, కబడ్డీలతో పాటు ఇతర సాంప్రదాయ క్రీడలను కూడా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. పెద్ద ఎత్తున యువత ఇందులో భాగస్వామ్యం అయ్యేలా కషి చేయాలన్నారు. క్రీడా సంబరాల నిర్వహణకు సంబంధించి దాతలు విరాళాల రూపంలో ఇవ్వడం ద్వారా దాతల పేరుమీదనే కార్యక్రమ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్, చిత్తూరు పేరు మీద చెక్కు రూపేణా విరాళాలను అందజేయవచ్చునని, జిల్లాలో గ్రామస్థాయి నుండి మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంను విజయవంతం చేయడంలో దాతలు సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, జెడ్పి సిఈఓ ప్రభాకర్ రెడ్డి, చీఫ్ కోచ్ బాలాజీ, డిపిఓ లక్ష్మీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



క్రీడా సంబరాల ప్రణాళికపై అధికార్లతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్

ఉద్యోగంతో పాటు సంక్షేమం ముఖ్యం : ఎస్పీ



పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పోలీస్ వ్యవస్థలో వారి ఉద్యోగంతో పాటు సంక్షేమాన్ని చూడాల్సి బాధత్య ఉందని జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి అన్నారు. ప్రతి శనివారం ఏఆర్, హోంగార్డ్ ల కొరకు ప్రత్యేక జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా గ్రీవెన్స్‌డే నిర్వహణ, సిబ్బంది తక్కువ ఉన్నందున సిబ్బందిపై అధికబారం పడుతోంది. దీనిపై డిజిపితో చర్చించడం జరిగిందన్నారు. శనివారం పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డ్ సిబ్బందితో దర్బార్ పెరేడ్ నిర్వహించారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన అనతరం ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది బాగోగులు గురించి, ఉద్యోగ నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకుని దర్బారు సందర్భంగా సిబ్బంది ప్రస్తావించిన సమస్యలు, సంక్షేమం పరంగా సూచించిన అంశాలపై నివేదిక సమర్పించాలని, సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి చిత్తూరు పర్యటన విజయవంతం కావడానికి తమ ఉద్యోగాన్ని ఎంతో బాధ్యతా హితంగా నిర్వర్తించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు.

రూ.44.50లకే నాణ్యమైన సోనా మసూరి

ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో బియ్యం ధరలను నియంత్రించడంలో భాగంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఒక కిలో సోనా మసూరి బియ్యం రూ.44.50లతో అందజేసేందుకు రైతు బజార్లు, మార్కెట్ యార్డ్‌లలో ప్రత్యేక విక్రయకేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక రైతు బజార్‌లో జిల్లా పౌర సరఫరాలశాఖచే ఏర్పాటు చేసిన ప్రత్యేక విక్రయ కేంద్రంను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం ధరల నియంత్రణలో భాగంగా జిల్లాలోని మార్కెట్ యార్డులు, రైతు బజార్‌లో ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నేడు ఏడు కౌంటర్లను ప్రారంభించడం జరిగిందని, చిత్తూరు రైతు బజార్ లో ఒకటి, పులిచెర్ల మండలం కల్లూరులో రెండు, నగిరిలో రెండు, పలమనేరులో రెండు కౌంటర్లను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఓ శంకరన్, మార్కెటింగ్ ఎడి పరమేశ్వరన్,సంబంధిత అధికారులు బియ్యం విక్రయించే అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంసిఏ ఫలితాలలో

విజయం బిజినెస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విజయం బిజినెస్‌స్కూల్ చిత్తూరు రెండవ సెమిస్టర్ ఎంసిఏ విద్యార్థులు శుక్రవారం శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ ప్రకటించిన ఫలితాలలో 86 శాతం ఉత్తీర్ణత సాధించారు. 126 మంది విద్యార్థులలో 109 విద్యార్థులు అన్ని సబ్జెక్ట్స్‌లో డిస్టింక్షన్‌లో పాస్ అయ్యారని విజయం సంస్థల అధిపతి ఎం.తేజోమూర్తి విద్యార్థులను అభినందిస్తూ, మా విద్యా సంస్థలో సిలబస్‌లోని అంశాలేగాక ఇతర టెక్నికల్ అంశాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పైథాన్, జావా, డాట్‌నెట్ తదితర ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మురళి మహతి (8.77), ప్రీతీ (8.58), హరిప్రసాద్ (8.49), గౌతమి (8.47), సరస్వతి (8.37), జయశ్రీ (8.35), లయ (8.35), లోహిత (8.35), తేజశ్రీ (8.35), చైతన్య (8.35), దివ్య (8.32), జ్యోతీశ్వరి (8.31) మొదటిపది స్థానాలు సాధించారు. ఈసందర్భంగా అకాడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి మాట్లాడుతూ మా విద్యార్థులు ఇటు అకాడమిక్‌పరంగా టెక్నికల్ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మురళి కష్ణ, ఎంసిఏ హెడ్ శ్రీనివాస్ ఇతర అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



MURALI MAHATHI (8.77 GPA)



E. PREETHI (8.58 GPA)



K. HARI PRASAD (8.49 GPA)

పెల్లుబికిన అంగన్‌వాడీల 'ఆక్రోశం'

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటి

వారు ఊరు మధ్యన ఓ సెంటర్‌లో చంటిబిడ్డలకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు యోగక్షేమాలు చూసుకుంటూ ఆటలు, పాటలు ద్వారా విద్యవైపు వారి గమ్యాన్ని మళ్లిస్తూంటారు. మధ్యాహ్నం నుంచి గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ, ప్రతి ప్రభుత్వపథకాన్ని ప్రజలకు దగ్గర చేస్తూ గ్రామంలో పెద్దక్క పాత్రను పోషిస్తారు. వారే అంగన్‌వాడీలు అది గతం మాట. ఇప్పుడు దీనికి అదనంగా యాప్‌లు, అప్‌లోడ్లు, ట్యాబ్‌లతో అదనపు భారం. ఇది చాలదన్నట్లు స్థానిక ప్రజాప్రతినిధి (సర్పంచ్, వార్డు మెంబర్లు) దగ్గర నుంచి, ఆఖరికి అధికార పార్టీ రాజకీయ నాయకుల వరకు వారిపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఉదయం లేచింది మొదలుకుని, రాత్రి వరకు అన్ని పనులు వారిపైనే. దీనికి తోడు ఈ మధ్య కాలంలో ఫుడ్‌కమిషనర్ పోస్టుల ద్వారా తనిఖీల పేరుతో వారిని అవమానించడం షరా మాములైంది. ఇప్పుడు వాలంటరీలు ఉన్నారు. గనుక సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు కాస్తంత వెసులుబాటు ఇచ్చినట్టే ఇచ్చే ఇతరాత్ర పనుల భారాన్ని మోపుతున్నారు. ఆఖరికి ఆరోగ్యం బాగులేక ఒక రోజు, ఒకపూట సెలవు పెడదామంటే నలుగురు పై అధికారులకు మెసేజ్‌లు పెట్టి, వారందరి అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి. దీనికి తోడు అరకొర ఆహార పదార్థాలు పంపిణీ, నాణ్యతలేని సరుకులు సరఫరా.. ఎక్కడ ఏది లోపించిన, బాధ్యులు మాత్రం అంగన్‌వాడీలే. పైపెచ్చు సెంటర్ల నిర్వాహణకు చెల్లించాల్సిన డబ్బులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. అంగన్‌వాడీలు తమ సొంత డబ్బులతో సెంటర్ల రెంట్ చెల్లిస్తున్న పరిస్థితులు. ఇంత చేస్తున్న వారికి చీత్కరింపులు, చీవాట్లు తప్పడం లేదు. ఆఖరికి ఉద్యోగ భద్రత కూడా కరవైంది. చాలీచాలనీ వేతనాలు, పెరిగిన నిత్యావసర ధరలు వల్ల కుటుంబ పోషణ కష్టతరమవుతోంది. ఊరందరికి పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీలు తమ కుటుంబానికి కనీసం పప్పన్నం పెట్టలేక అవస్థలు పడుతున్నారు. పైగా రాజకీయ వేధింపులు తాళ్లలేక అంగన్‌వాడీలు మానసిక, శారీరక రుగ్మతులకు గురవుతుండడం గమనార్హం. అలాంటి వారు ఆక్రోశంతో రోడ్డెక్కారు. అందుకు కారణం ఐసిడిఎస్ పరిరక్షణే. ఆహర్నిశలు శ్రమిస్తూ సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తున్న తమ బతుకులను బాగు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం చివరకు ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయాలని కుట్రచేయడంతో, విధిలేని పరిస్థితుల్లో సమ్మెకు దిగారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీ సమ్మెలో బాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు మద్దతుతో పోరుబాటపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ కార్యాలయాల వద్ద 36 గంటల మహాధర్నాకు పిలుపునిచ్చారు. పసిపిల్లలకు వంటచేసి వడ్డించే అంగన్‌వాడీలు నడిరోడ్డుపై వంటవార్పు చేశారు. గర్భవతులకు పౌష్టికాహారం అందించే పెద్దక్కలు చిమ్మచీకట్లో, దోమలు తమ రక్తాన్ని పీల్చుతున్నా వెరవక నిరసన నిద్ర చేపట్టారు. అటు గ్రామానికి, ఇటు కుటుంబానికి అన్ని తానై నిలిచిన వారు 36 గంటల పాటు అందర్ని వదిలి కలెక్టర్ కార్యాలయాలవద్ద పడిగాపులు కాశారు. ఇదంతా మణులు మాణిక్యాల కోసమే, రాజ్యాలు, రాజ్యాధికారాల కోసమో కాదు. పసిపిల్లలకు అన్నం పెట్టే తమ కుటుంబాలు పస్తులతో ఉండకుండా చూడమని, 12 సంవత్సరాలుగా నయాపైసా కూడా పెరగని తమ జీతాల్లో కాస్త కదలిక ఇవ్వాలని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత రాష్ట్ర పాలకులు ఇచ్చిన హామీని అమలు చేయమని, ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని అనుచరించాలని, దేశానికి తలమానికంగా నిలిచిన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయమని కోరుతూ రోడ్డుపైకి వచ్చారు. దీనికి పాలకులు ప్రతి స్పందన... పలు చోట్ల అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, లాఠీచార్జీలు, దాడులు, దౌర్జనాలు. కొన్ని చోట్ల చూద్దాం.. పైవాళ్లకి చెబుదాం.. అనేలా అధికారులు తీరు కొట్టొచిన్నట్లు కనిపించింది. కనీసం మంత్రివర్గ సమావేశంలోనైనా తమకు కాస్త ఊరట కల్గించే నిర్ణయాలు ఉంటాయని బావించిన అంగన్‌వాడీలకు మరోసారి నిరాశ తప్పలేదు. ఏళ్లతరబడి ప్రభుత్వాల తీరుతో విసిగి వేజారిన అంగన్‌వాడీలు తమ ఆవేదనను మరింత గెట్టిగా వినిపించాలని బావిస్తున్నారు. రానున్న రోజుల్లో పాలకుల తీరుకు నిరసనగా పెద్దఎత్తున పోరాటాలు చేసైనా తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించుకోవాలని దీక్షభూనారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు మేల్కొని, భవిష్యత్తు తరాలకు సపర్యాలు చేసే అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని పులువురు మేధావివర్గం, ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు. పాలకులారా ఆలోచించండి. ఆంగన్‌వాడీలను ఆదుకోండి.



గిరిజనుల సమస్యలు పరిష్కరిచండి

రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్



గిరిజనుల సమస్యలపై కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గంగవరం మండలం, కుయ్యవంక యానాది కాలనీ గిరిజనులకు సంబంధించి ఇంటిపట్టాల సమస్యను పరిస్కారించాలని జిల్లా కలెక్టర్‌ని కోరడం జరిగిందని రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. చిత్తూరు జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను, జిల్లా ఎస్పీ వై.రిషాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి గిరిజనులకు ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాల పంపిణీ, గిరిజనుల సమస్యలపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో చర్చడం జరిగిందని తెలిపారు. శనివారం పట్టణంలోని ఆర్ అండ్‌బి అతిథి గహంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజులు చిత్తూరు జిల్లాలో పర్యటించడం జరిగిందని తెలిపారు. గంగవరం మండలం, కీళ్లపట్ల పంచాయతీ, కుయ్యవంక యానాది కాలనీ గిరిజనులకు సంబంధించి ఇంటి పట్టాలు పంపిణీ విషయంలో గత కొన్ని సంవత్సరాలుగా సమస్య పరిస్కారం జరగలేదని, గతంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కమిషన్ సభ్యులు పర్యటించడం జరిగిందని, అక్కడ గిరిజనలు ఇండ్ల నిర్మాణం కోసం బేస్‌మట్టడం కూడా వేసుకున్నారని వారికి తగిన న్యాయం చేసి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌ని కోరడం జరిగిందన్నారు. కలెక్టర్ కూడా పరిశీలించి వారికి న్యాయం చేయడం జరుగుతుందని తెలియజేశారని తెలిపారు. ఇంకా కొందరికి ఆధార్, రేషన్ కార్డులు లేనందున ప్రభుత్వం నవరత్నాల పథకాల ద్వారా అందించే సంక్షేమ ఫలాలు పొందలెకున్నారని, అలాంటి వారికి ఆధార్, రేషన్ కార్డులు అందజేయాలని కోరారు. శుక్రవారం రామకుప్పం మండలంలో పర్యటించడం జరిగిందని, ప్రభుత్వ అందించే సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలు అర్హులైన పేద గిరిజనలకు సక్రమంగా అందించే మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అక్కడ కొన్నిగ్రామాలలో సిసి రోడ్లు, విద్యుత్ ట్రాన్స్ఫర్మ్ ఇంకా పింఛన్లు, అంగన్వ్వాడి కేంద్రం లేదని, ఇండ్లు మంజూరు చేయాలని, శ్మశాన వాటికకు భూములు కేటాయించాలని అర్జీలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సమస్యలు సంబంధించిన అధికారులు పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్ కోరడం జరిగిందని తెలిపారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని. గిరిజన గ్రామాలలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, ఇంకా కొన్ని గ్రామాలలో సమస్యలు ఉన్నాయాని వాటిని పరిశీలించి సమస్యలను పరిస్కారం చేయడం జరుగుతుందని తెలిపారు. అన్యాయం జరిగి పోలీస్ స్టేషన్‌కు వచ్చే గిరిజనలకు తగిన న్యాయం చేసేలా మీ కింది స్థాయి పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎస్పీని కోరడం జరిగిందన్నారు. దీని పై ఎస్పీ స్పందించి సమస్యలతో పోలీస్ స్టేషన్స్‌కు వచ్చిన గిరిజనుల సమస్యలను విచారించి వారికి తగినన్యాయం చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి ఏ.మూర్తి ఉన్నారు.

అర్జీలను స్వీకరించిన వడిత్యా శంకర్ నాయక్

చిత్తూరు జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం ఉదయం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గహం నందు ఉన్న రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్‌కు జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన గిరిజనులు తమ సమస్యల కు సంబంధించి అర్జీలను అందజేశారు.

లా నేస్తం ప్రతినెలా ఇవ్వాలి

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం డిమాండ్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో శనివారం స్థానిక ఎల్‌జిబి టవర్స్‌లో నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథులుగా ఐలు రాష్ట్ర నాయకులు మురళి, ప్రధానకార్యదర్శి దేవరాజులు, జిల్లా నాయకులు చల్లా వెంకటయ్యలు ముఖ్యఅతిథులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జూనియర్ న్యాయవాదులు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. జూనియన్ న్యాయవాదులకు ఇచ్చే లా నేస్తం ప్రతినెలా ఇవ్వాలని, జూనియర్ న్యాయవాదులకు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీసులను త్వరితగతిన జారీచేయాలని, న్యాయవాదులకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపి కల్పించిన ఇన్సూరెన్స్ కార్డులను త్వరితగతిన జారీ చేయాలని సమావేశం తీర్మానించింది. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) గౌరవాధ్యక్షులు సురేంద్ర కుమార్, అధ్యక్షులుగా సుగుణ శేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గోపి, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాసబాబు, సహాయ కార్యదర్శిగా మోహిద్దిన్, కార్యదర్శిగా స్వరూపాలక్ష్మి, జూనియర్ ఇన్‌చార్జిలుగా వాసుదేవరెడ్డి, వాసు, మహిళా ప్రతినిధి నళిని, ట్రజర్‌గా గోమతి ఈసి మెంబర్స్‌గా వెంకటరమణ, కోమల, ప్రియదర్శిని, వెంకటేష్‌లను ఎన్నుకున్నారు.



సురేంద్రకుమార్



సుగుణశేఖర్‌రెడ్డి



శ్రీనివాసబాబు

రేషన్ సరుకులు అందక ఇబ్బందులు

ప్రజాశక్తి-పుంగనూరు: ప్రభుత్వ చౌక దుకాణం ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ సరుకులు ఇప్పటివరకు అందలేదని, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రియాంక సేవా దళ్ అధ్యక్షుడు సజ్జాద్ భాష శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు ప్రతినెలా మొదటి వారంలోపు అందించేవారని, ఈ నెల 15 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు రేషన్ సరుకులు అందక పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులలో బియ్యం నాణ్యత లేకుండా పురుగులు ఉన్నాయని అలాగే రాగులు నాణ్యత లేకుండా ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. నాణ్యమైన సరుకులను రేషన్ కార్డుదారులకు సకాలంలో అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇప్పటివరకు పుంగనూరు నియోజకవర్గంలో రేషన్ సరుకులు 15 రోజులు గడుస్తున్నా అందివ్వలేదని ఆరోపించారు. పట్టణంలో చాలావరకు రేషన్ సరుకులు అందడం లేదు అని ఆరోపించారు. ఇప్పటికే అధిక ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి రేషన్ సరుకులు అందించాలని కోరారు.

రాగిపంటపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

ప్రజాశక్తి-గుడిపల్లి: అంతర్జాతీయ సిరి ధాన్యాల సంవత్సరం 2023లో భాగంగా గుడుపల్లిలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు చిరు ధాన్యాల ప్రాముఖ్యత, రాగి పంటను ఏ విధంగా సాగు చేయాలి, దాని లాభాలు, వాటిని ఉపయోగించడంతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు అన్ని రకాల నేలలలో తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక పంట దిగుబడిని పొందవచ్చన్నారు. వరి, వేరుశనగ తదితర పంటలను తగ్గించి, రాగి పంట విస్తీర్ణాన్ని పెంచాలని తెలిపారు. ఈ సంవత్సరంలో గుడిపల్లి మండలానికి 5 వేల ఎకరాల రాగి సాగు చేయాలని టార్గెట్ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఈ సంవత్సరం ప్రభుత్వం కిలో రూ.38 ల చొప్పున రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా ఈ పంట నమోదు ఆధారంగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. కావున రైతులందరూ రాగి పంట సాగుని ప్రోత్సహించి మనకు కేటాయించిన టార్గెట్‌ను అధిగమించి తద్వారా రైతులు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరను పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యంతో ఎదగాలి



మాట్లాడుతున్న హీరో మన్యం మురళీకృష్ణ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: విద్యార్థులు నైపుణ్యంతో ఎదగాలని సినీ హీరో మన్యం మురళీకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అభివృద్ధి చెందేందుకు అవగాహన కార్యక్రమం ప్రిన్సిపల్ రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర 100 డ్రీమ్స్ యువ తరంగ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి నైపుణ్యతలపై అవగాహన పెంచుకోవాలని, కులమతాలకు బేధాలు లేకుండా అందరూ కలిసికట్టుగా అభివృద్ధి చెందాలని సాటివారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో లెక్చరర్ మురళీకృష్ణ, శ్రీనివాసులు, హసీనా, పద్మావతి, అధ్యాపకులు, విద్యార్థులు, హీరో అభిమానులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్‌గా ఏకాంబరం



ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల కోఆర్డినేటర్ (స్వచ్ఛభారత్) గా టీటీ కండ్రిగ గ్రామానికి చెందిన ఏకాంబరం జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ పథకం కింద గ్రీన్ అంబాసిడర్స్ విధులపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నెల్లిమంద పాలేటమ్మ జాతర

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నెల్లిమంద పంచాయతీలో గల పాలేటి అమ్మవారి జాతరను నేడు, రేపు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. పంచాయతీలోని పలు గ్రామాల వారు నెల్లిమంద జాతరను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గత ఆదివారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుండి వెలుపలకు తీసి పంచాయతీలోని పలు గ్రామాలలో ఊరేగింపుగా తీసుకువెళ్లి పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి చాందిని బండ్ల ఊరేగింపు, సోమవారం ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పిస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఆది, సోమవారాలలో భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పొగాకు వాడకంతో క్యాన్సర్



అగాహన కల్పిస్తున్న పీహెచ్‌ఎన్ ఇంద్రావతమ్మ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పొగాకు వాడకం దుష్పరిణామాలు అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌ఎన్ ఇంద్రావతమ్మ మాట్లాడుతూ ధూమపానం, పొగాకు వాడటంతో ఊపిరితిత్తులు దెబ్బ తినడం, క్యాన్సర్, పక్షవాతం వస్తాయని తెలిపారు. యువత ధూమ, మద్యపానం వంటి వ్యసనాలకు బానిసలవుతూ ఆరోగ్యాలను పాడుచేసుకుంటూ కుటుంబ సభ్యులకు ఆవేదన కలిగిస్తున్నారని తెలిపారు. యువతరం చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఆరోగ్యాన్ని, సమాజాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గీ, కళాశాల ప్రిన్సిపల్ గంగాధర నాయుడు, సూపర్‌వైజర్ ఉష, సిహెచ్‌ఎన్ అమర్‌నాథ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జయరాం, ఆశా కార్యకర్త వరలక్ష్మి, కళాశాల అధ్యాపక బందం పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాయలసీమ అభివృద్ధి'

ప్రజాశక్తి-పలమనేరు: తెలుగుదేశం పార్టీతోనే రాయలసీమ అభివృద్ధి సాధ్యమని పలమనేరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు భువన చంద్ర గౌడ్ పేర్కొన్నారు. యువగళం పాదయాత్రతో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాయలసీమ అభివృద్ధికై రూపొందించిన మిషన్ రాయలసీమ పోస్టర్లను తెలుగుయువత ఆధ్వర్యంలో మాజీ మంత్రి అమరనాథ రెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భువన చంద్ర గౌడ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రానున్న ఐదేళ్లలో రాయలసీమ ప్రాంతాన్ని ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తామని యువనేత హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రాయలసీమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఉపాధికి గమ్యస్థానంగా రాయలసీమను మారుస్తామన్నారు. ఇప్పటివరకు రాయలసీమ ప్రాంతానికి ఏమి చేసినా అది తెలుగుదేశం ప్రభుత్వమే చేసిందని, తెలుగుదేశం అధికారంలోకి వస్తే రాయలసీమ ప్రాంతాన్ని ప్రగతి కేంద్రంగా, ఉపాధి, ఉద్యోగాలకు గమ్యస్థానంగా మార్చేందుకు తెలుగుదేశం కృషి చేస్తుంద న్నారు. యువగళంలో భాగంగా నారా లోకేష్ రాయలసీమలో వేసిన ప్రతి అడుగు ఈ ప్రాంత అభివృద్ధికేనన్నారు. మనందరి భవిష్యత్‌కు బాబును గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ లోకేష్ ఆచారి, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్ గౌడ్, పలమనేరు రూరల్, టౌన్, గంగవరం, మండల తెలుగు యువత అధ్యక్షులు వెంకటముని రెడ్డి, శ్రీధర్, గిరిధర్ గోపాల్, రవి, వాసు, మంజు, మురళి తదితరులు ఉన్నారు.



మిషన్ రాయలసీమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అమరనాథరెడ్డి

ఫీవర్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి-పలమనేరు: 50వ విడత ఫీవర్ సర్వే ప్రతి వాలంటీర్ తప్పనిసరిగా ప్రతి ఇంటిని సందర్శించి జ్వరం కేసులను తమ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సబ్ యూనిట్ అధికారి జయ శంకర్ శనివారం తెలిపారు. అందులో భాగంగా గంటవూరులో తమ సిబ్బంది, ఆశాలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ ద్వారా నమోదు చేసిన జ్వరం కేసులు అప్లోడ్ చేసిన వెంటనే ఎఎన్ఎం ఏపీ హెల్త్ యాప్‌లోకి వస్తాయన్నారు. జ్వరం వచ్చిన వారి దగ్గరకు సచివాలయం హెల్త్ సెక్రటరీ వెళ్లి ఫీవర్ ఉన్న మొదట మలేరియా టెస్ట్ చేయడం జరుగుతుందని, అందులో పాజిటివ్ వచ్చిన వారికి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ ద్వారా ట్రీట్‌మెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలా కాక నెగిటివ్ వచ్చిన వారికి డెంగీ టెస్ట్ చేసిన వారికి పాజిటివ్ వచ్చిన వారికి ఎంఉ ద్వారా డెంగీ ఎలిసా టెస్ట్‌కు పలమనేరు ఏరియా ఆసుపత్రికి పంపడం జరుగుతుందన్నారు. ఈ విధంగా 50వ ఫీవర్ సర్వేలో పకడ్బందీగా చేసి మలేరియా, డెంగీ వ్యాధిని అరికట్టాలని, అలాగే వర్షాలు పడుతుండటంతో ఇంటి చుట్టూ పక్కల నీరు నిల్వలు ఉండకుండా చూడాలని, ఇంటి లోపల, బయట మంచి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు తెలియచేశారు. ఈ ఫీవర్ సర్వేలో ప్రజలు అందరూ సహకరించి మలేరియా, డెంగీ వ్యాధులు లేని సమాజాన్ని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఇంద్రాణి, ఆశలు ఉమ, అనిత, షాహీన పాల్గొన్నారు.



సర్వేలో వివరాలు సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ప్రజా సమస్యలపై గళమెత్తిన పలమనేరు పరిరక్షణ సమితి

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై పలమనేరు పరిరక్షణ సమితి పలుమార్లు అధికార్ల దష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకపోవడంతో శనివారం మండల న్యాయ సేవా కమిటీ దష్టికి తీసుకెళ్లారు. వీటిలో ముఖ్యంగా గుడియాత్తం రోడ్డు కూడలిలో దుర్గంధం, పారిశుద్ధ్య లోపాలు, వారపు సంతలో అపరిశుభ్రత, జడ్పీ బాలికల పాఠశాల వద్ద రోడ్డు ఆక్రమణలు, రంగ మహల్ క్రాస్ వద్ద వేగ నిరోధక ఎత్తు తగ్గింపు, మైనర్ విద్యార్థులు బైక్ లలో అడ్డదిడ్డంగా వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్న అంశాలను న్యాయమూర్తి దష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై స్పందించిన న్యాయమూర్తి మున్సిపల్, పోలీస్ అధికారులను పిలిపించి సమస్యలపై అధ్యయనం చేసి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించి, తదుపరి విచారణను ఆగస్టు 5వ తేదీకి నిర్ణయించారు. కార్యక్రమంలో పలమనేరు పరిరక్షణ సమితి మాజీ అధ్యక్షులు సిద్ధయ్య, కార్యవర్గ సభ్యులు పొన్ముడి, భాస్కర్, సుబ్రమణ్యం, విజయకుమార్, శేఖర్, సాంబయ్య, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.



కాలువలను పరిశీలిస్తున్న మండల న్యాయసేవా కమిటీ

'జగనన్న సురక్ష'కు విశేష స్పందన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కమ్మనపల్లి, కడపనత్తం గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, తహశీల్దార్ కుమారస్వామి హాజరై స్థానిక సర్పంచ్‌ల సమక్షంలో 424 మంది సమస్యలను పరిష్కరించారు. ఇందులో భాగంగా 275 సర్టిఫికెట్స్, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ 30 మందికి, అలాగే క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్స్ అందించారు. సర్పంచ్‌లు రాజన్న, నాగరత్నమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను అక్కడికి వచ్చిన వారికి క్షుణ్ణంగా తెలియపరిచి, పథకంలో అర్హత ఉండి పథకాలు రానివారికి వాలంటీర్ల ద్వారా గుర్తించి నివేదిక ఇవ్వాలని తెలియజేశారు. అదేవిధంగా సచివాలయం పరిధిలో ఈనెల15వ తేదీ నుండి ప్రతి సచివాలయంలో నగదు లావాదేవీల ప్రక్రియ జరుగునని, ఆసక్తి కలవారు ఆధార్ అనుసంధానంతో అమౌంట్ ట్రాన్స్‌ఫర్, విత్ డ్రా చేసుకోవచ్చని స్థానిక ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ తెలిపారు.



బైరెడ్డిపల్లిలో..

నగరి: పేదలందరికీ పథకాల లబ్ది అందించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం తెలిపారు. శనివారం మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం సౌత్ సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంప్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్‌ఛైర్మన్ బాలన్, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, వీకే శ్రీనివాసన్, కోఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్, నాయకులు బాబు, అమర్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ఎస్ఆర్ పురం మండలంలోని అంకనపల్లి ధర్మరాజుల గుడి ఆవరణలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని బెంగుళూరు నుంచి తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో తిరుమల తిరుపతి వేద పండితుల వారిచే వేద పారాయణంతో వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి బెంగళూరు, ఇతర ప్రాంతాలతో పాటు ఎస్ఆర్ పురం మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదం అందించారు. అనంతరం రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహిచారు. ఉభయదారులుగా బోడపాటి ధరణి దేవరాజుల నాయుడు, గంధమనేని శోభ, మంజునాథ నాయుడు, బోడపాటి పుష్పలత, అశోక్ నాయుడు వ్యవహరించారు.

ధరల నియంత్రణకే బియ్యం విక్రయ కేంద్రం

ప్రజాశక్తి-నగరి: ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్కువ ధరకు బియ్యం విక్రయించే కేంద్రాలను ఏర్పాటుచేస్తోందని ఆర్డీవో సుజన అన్నారు. శనివారం పౌరసరఫరాలశాఖ ఆదేశాల మేరకు నగరి భవాని హైటెక్ రైస్ మిల్ వారు ఏర్పాటుచేసిన బియ్యం కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. బియ్యం కొనుగోలుకు వచ్చిన వారికి బియ్యం బస్తాలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బియ్యం విక్రయ కేంద్రాల్లో తక్కువ ధరకే బియ్యం విక్రయిస్తారన్నారు. మార్కెట్‌లో రూ.52 పలికే నాణ్యమైన బియ్యం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రంలో రూ.44.50కే లభిస్తుందన్నారు. త్వరలో పప్పు దినుసులను విక్రయ కేంద్రాల్లో తక్కువ ధరకు అందిస్తామన్నారు. ఈ సదుపాయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన విక్రయ కేంద్రంలో కొనుగోలు చేసుకోవాలన్నారు. బియ్యం నాణ్యత, కొలతలను తరచూ పరిశీలిస్తుంటామన్నారు. కార్యక్రమంలో మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పాలన

ప్రజాశక్తి-శాంతిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని కెనమాకులపల్లిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. జడ్పిటిసి ఎస్ శ్రీనివాసులు, ఎంపీపీ కే వసుంధర కోదండ రెడ్డి, మండల కన్వీనర్ బుల్లెట్ దండ పాణి, వైస్ ఎంపీపీ టీవీ పట్టాభి, కోఆప్షన్ సభ్యుడు బి నిసార్, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వి పెద్దన్న, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నాగభూషణమ్మ సుబ్బరాజు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వైసీపీ ప్రభుత్వం నెరవేర్చిందని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బంగారుపాళ్యం 1 సచివాలయ పరిధిలోని గహాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చారని, ఆయన పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ అభివద్ధి దిశగా వెళుతుందన్నారు. అనంతరం ఆయన గడపగడపకు వెళ్లి సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వడ్డురు గ్రామంలో తాగునీరు మోటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్ర రెడ్డి, ఎంపీపీ అమరావతి, జడ్పిటిసి సోమశేఖర్, కోఆప్షన్ మెంబర్ ఫిరోజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



వడ్డురు గ్రామంలో తాగునీటి మోటార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్సీకి స్వాగతం పలుకుతున్న గృహిణి

ఉపాధ్యాయులకు శిక్షణ



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కుప్పం: స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిజిటల్ ఎడ్యుకేషన్ సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, గుడిపల్లి, శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలాల్లోని ఉపాధ్యాయులకు డిజిటల్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌సి స్మార్ట్ టీవీఎస్ ఆఫ్ బై జూస్ ఈ కంటెంట్లపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో ఇప్పటికే అభ్యాసంపై సంప్రదాయ విధానాన్ని కలిగి ఉన్న వాటికంటే మెరుగ్గా ఉండటం గమనించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి ఉపాధ్యాయులకు ఈ లెర్నింగ్ టెక్నాలజీ పై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. సాంకేతిక ఆధారిత అభ్యాసం ప్రాముఖ్యత, ప్రభావాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులలో పట్టణ సామర్థ్యాన్ని పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. చిత్రాలు లేదా వీడియోల ద్వారా కనిపించే వాటిని మానవ మెదడు సులభంగా అర్థమయ్యే విధంగా ఈ తరగతుల్లో తెలియజేశారు. కార్యక్రమంలో మండలాలకు సంబంధించిన ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

27న లోక్ అదాలత్



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి

ప్రజాశక్తి-పలమనేరు: ఈనెల 27వ తేదీన జరిగే స్పెషల్ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. అందులో భాగంగా శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో మునిసిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, సిఐ చంద్రశేఖర్, ఎంపీడీవో విద్యాసాగర్‌లతో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ లోక్ అదాలత్‌లో మోటార్ వెహికల్ కేసులు, ల్యాండ్ అక్విజేషన్ కేసులకు సంబంధించి కక్షిదారులు పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. అలాగే పలమనేరు పట్టణంలో రహదారులతో ప్రజలకు ట్రాఫిక్ పరంగా ఇబ్బందులు కలగకుండా మునిసిపల్ కమిషనర్, పలమనేరు సిఐతో చర్చించారు. చిన్నపిల్లలను చదువుకునే వయసులో స్కూలుకు పంపకుండా ఎక్కడైనా పనిలో పెడితే పనిలో పెట్టుకున్న యజమానులకు, పనికి పంపించిన వారికి శిక్ష పడుతుందన్నారు. బాల్య వివాహం ఎక్కడైనా జరుగుతుంటే వెంటనే దగ్గరున్న పోలీసు అధికారులకు లేదా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని కోదలమడుగు ప్రాథమిక ఉన్నత పాఠశాలను శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీత వేసి పలు సంక్షేమ పథకాలను ప్రారంభించిందని, విద్యాభివృద్ధితో రాష్ట్ర అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశ్యంతో సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామ చంద్ర రెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్, ఎంపీపీ అమరావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని కల్లుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ టీచర్ నిర్మల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు మూడు నెలలు నిండిన గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం, వారు నడుచుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. గర్భిణులు తనతో పాటు కడుపులోని బిడ్డను కాపాడుకోవాల్సిన బాధ్యత కలిగి ఉండాలని, అందువల్ల డాక్టర్ సలహా మేరకు నడుచుకొని ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి వారి సలహాలను పాటిస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా కాన్పు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.



సీమంతంలో పాల్గొన్న గర్భిణులు

గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం



గంజాయి విక్రయదారుల అరెస్టును చూపుతున్న సీఐ మద్దయాచారి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి సరఫరా చేసే వ్యక్తులను ఉక్కుపాదంతో అణచి వేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు చిత్తూరు సబ్-డివిజినల్ పోలీసు ఆఫీసర్, డిఎస్‌పి శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో చిత్తూరు టూటౌన్ సిఐ మద్దయాచారి, సిబ్బంది శనివారం స్థానిక జానకారపల్లి, ఓబనపల్లి కాలనీలలో రైడ్ నిర్వహించి 7మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని 4.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో గంజాయి విగ్రయదార్లు కుమార్, గణేష్, ధనమ్మ, వళ్ళియమ్మ, మార్గబంధు, కుప్పన్, కార్తిక్ ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల కేంద్రంలోని మేదర వీధి శ్రీ వెంకటేశ్వర క్లినిక్ డాక్టర్ లోహిత్ చంగల్ రాయులు ఆధ్వర్యంలో, అలాగే బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బందిచే క్యాన్సర్, గుండె, కిడ్నీ డయాలసిస్ వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు చేయబడుతుందని డాక్టర్ లోహిత్ చంగల్ రాయులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలిపారు.

108 వాహనంలోనే ప్రసవం



ప్రజాశక్తి-రొంపిచెర్ల: పురిటి నొప్పులతో ఉన్న గర్భిణీని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే ప్రసవమైన ఘటన మండలంలో జరిగింది. మండలంలోని ఇటుకల బట్టీలో పని చేస్తున్న గణేష్ భార్య మీనా ను ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. శనివారం ఉదయం ఫోన్ చేయగా, 108 అంబులెన్స్ అక్కడికి చేరుకొని రొంపిచెర్ల ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలిస్తుండగానే 8.44 నిమిషాలకు ప్రసవం అయింది. మార్గమధ్యలోనే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది అంబులెన్స్‌ని రోడ్డు పక్కన నిలిపేసి డెలివరీ చేశారు. మీనా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. మీనా కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీ కార్మికులకు జీతాలు పెంచాలి

ప్రజాశక్తి-నగరి: మహిళా కార్మికులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మనుగడ సాగించలేదని, అంగన్‌వాడీ కార్మికులకు వెంటనే జీతాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇంప్లిమెంట్ చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య శనివారం డిమాండ్ చేశారు. నగరి అంగన్‌వాడీ ప్రాజెక్టు సమావేశం ప్రాజెక్టు కార్యదర్శి మునెమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శులు మునియమ్మ, సూర్యప్రభ, కస్తూరి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అంగన్‌వాడీ ఖాళీలకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపివో వాణిశ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని చీకురుపల్లి (ఓసీ), బూరగమానూరు (ఓసీ), చంద్రశేఖరపురం (ఓసీ), యానాధ బండపల్లి (ఎస్టీ), యాదమూరు మండలం 180 కొత్తపల్లి (ఓసీ) అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తులకు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని, ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం



ప్రజాశక్తి-శాంతిపురం: క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను బోధించడమే తమ పాఠశాల లక్ష్యం అని వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ ఆశా శంకరప్ప పేర్కొన్నారు. శనివారం స్థానిక వివేకానంద పాఠశాలల్లో తల్లితండ్రులు, విద్యా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణతో విద్యను బోధించి గట్టి పునాది వేస్తామని అన్నారు. ప్రారంభ దశలోనే పిల్లలకు మంచి విద్యను బోధిస్తే సులభంగా అభ్యసించగలరని అన్నారు. అందుకు అనుగుణంగా తమ పాఠశాలలో ప్రత్యేక పద్ధతుల్లో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లితండ్రుల నుండి సలహాలు తీసుకుని వారి అదష్టం మేరకు విద్యాబోధన చేపడతామన్నారు. పాఠశాల ఐక్యం అమ్ము మాలతి, అధ్యాపకులు ఆనంద్, నవనీత, సుబ్రహ్మణ్యం, రవి,సరళ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.